సాక్షి
బాపట్ల
మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి 5,009 క్యూసెక్కులు పశ్చిమ డెల్టాకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది.



పులిచింతలకు నీటి విడుదల

సత్రశాల(రెంటచింతల):టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి 2,84,677 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ తెలిపారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మను మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

బాపట్ల బీచ్ ఫెస్టివల్ వాయిదా

జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి

బాపట్ల: సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌ను వాయిదా వేసినట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న ఫెస్టివల్‌ను వాతావరణంలో మార్పులు కారణంగా వాయిదా వేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మళ్లీ తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటన విడుదల చేస్తామని వివరించారు.

అమ్మవారి పాదాలను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం సూర్య కిరణాలు అమ్మవారి పాదాలను తాకాయి. 7 నుంచి 7.20 గంటల వరకు 20 నిముషాల పాటు కిరణాలు తాకిన సమయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ప్రారంభం రోజు కావడంతో భక్తులు పరవశించిపోయారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి: జేసీ



బాపట్ల: అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని, ప్రతి అర్జీకి తప్పనిసరిగా పరిష్కారం చూపాలని జిల్లా ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాలు ద్వారా తమ సమస్యలను విన్నవించారు. ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ ఎస్.లవన్న, డీపీఓ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీలు

కారెంపూడి: మార్టూరు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రెండు గ్రానైట్ లోడు లారీలను కారెంపూడి ఎస్ఐ వాసు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పన్ను కట్టకుండా గ్రానైట్ తరలిపోతుందని పోలీసులు, వాహనాలను ఆపారు. అనంతరం సేల్స్‌టాక్స్, మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు.

ఆన్‌లైన్‌లో అగ్రిసెట్ ఫలితాలు

గుంటూరురూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన అగ్రిసెట్- 2025 పరీక్ష ఫలితాలను సోమవారం వీసీ ఆర్.శారదజయలక్ష్మీదేవి విడుదల చేశారు. ఫలితాలు మంగళవారం నుంచి వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని రిజిస్ట్రార్ ఎం.వి. రమణ తెలిపారు.

అతుకుల కట్ట.. భద్రత ఎట్టా!

ప్రతి వర్షాకాలం క్షణక్షణం.. భయం భయంగా లంకగ్రామాలు

- వరదలు ఉధృతమైతే కరకట్ట మనుగడ ప్రశ్నార్థకం
- పాఠాలు నేర్వని కూటమి ప్రభుత్వం
- మరమ్మతులకు నిధులు కేటాయింపులో మొండిచెయ్యి

కొల్లూరు: కృష్ణా కరకట్ట భయపెడుతోంది.. వరదొస్తే క్షణక్షణం భయం.. పరీవాహక గ్రామాలకు రక్షణ కవచంగా ఉండాల్సిన కరకట్ట భయాందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో 67 కిలోమీటర్లు పొడవునా అతుకుల బొంతను తలపించేలా కరకట్ట మారింది. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అభివృద్ధికి నిధులు లేవు..

కృష్ణా నదికి వరదలు వచ్చే సమయంలో ప్రభుత్వం హడావిడి చేస్తుంది. శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. జిల్లాలో కొల్లూరు మండలం చిలుమూరు శివారు కొత్త చిలుమూరు నుంచి రేపల్లె మండలం లంకేవానిదిబ్బ వరకు 67 కిలోమీటర్లు పొడవునా విస్తరించి ఉంది. 55 ప్రాంతాలలో బలహీనంగా మారినట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. మరో 20 వరకు పెరుగుతాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. కానీ కరకట్ట పటిష్టతకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు.

డేంజర్ స్పాట్లు ఇలా...

కొల్లూరు ఆర్సీ సెక్షన్ (రివర్ అండ్ కన్జర్వేషన్) పరిధిలో ఈపూరు, దోనేపూడి- కోటిపల్లి ప్రాంతాలలో అధిక చోట్ల కరకట్ట బలహీనంగా మారింది. గతంలో తాత్కాలిక మరమ్మతులలో భాగంగా వేసిన ఇసుక మూటలు ధ్వంసమై వరద తీవ్రత పెరిగిన పక్షంలో తట్టుకొని నిలవడం కష్టంగా తయారైంది. వీటికి తోడు సాగు నీటి కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లతో ముప్పు పొంచిలేకపోలేదు. పెనుమూడి ఆర్సీ సెక్షన్ పరిధిలో 51 ప్రాంతాలలో కరకట్ట బలహీనంగా మారి ప్రమాదకరంగా మారడం కరకట్ట దుస్థితికి అద్దం పడుతుంది.

అనుభవాల నుంచి నేర్వని గుణపాఠాలు

2024లో 11.43 లక్షల క్యూసెక్కులు వరద ముంచెత్తడంతో జిల్లాలోని కరకట్ట పొడవునా ప్రజలు నిద్రాహారాలు మాని స్వచ్ఛందంగా కదలి కట్ట తెగకుండా అడ్డుకట్టలు వేస్తూ కంటికి రెప్పలా కాపాడుకొని గ్రామాలపై వరద విరుచుకుపడకుండా అడ్డుకున్నారు. చివరి నిమషంలో కృష్ణమ్మ తగ్గుముఖం పట్టడంతో గండం గట్టెక్కి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్నుంచి కరకట్ట బలహీనంగా ఉండి కోతలకు అవకాశాలున్న ప్రాంతాలను అభివృద్ధి చేయకపోవడంతో ప్రస్తుత ఏడాది కృష్ణా నది వరదలు ఉధృత రూపం దాల్చితే పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.



వరద ఉధృతితో కోతకు గురైన కరకట్టకు తాత్కాలికంగా ఇసుక మూటలు వేయగా జారిపోయిన దృశ్యం

సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై అవగాహన

కొల్లూరు: కృష్ణా నదికి వరద పెరగనుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం పోతార్లంక శివారు రావిలంక వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ జానిక అమరవర్ధన్ సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు. అక్కడ నివసిస్తున్న కుటుంబాలు తమ వద్ద అందుబాటులో ఉన్న పడవల సాయంతో కృష్ణా జిల్లా వెలివోలు, నడకుదురు ప్రాంతాలకు వెళ్తామని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జీవాలు, పశువులను తమ వద్ద ఉన్న పడవల ద్వారా నదిని దాటించడం కష్టమని అధికారుల దృష్టికి తీసుకురావడంతో మంగళవారం పెద్ద బోట్లను ఏర్పాటు చేసి సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.



పోతార్లంక శివారు రావిలంక వాసులకు వరద తీవ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కృష్ణా నదిలో పెరుగుతున్న వరద



పెసర్లంక- పెదలంక అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా నది

కొల్లూరు: కృష్ణా నదికి వరద ఉధృతి పెరిగింది. నీటి మట్టం పెరగడంతో లోతట్టు ప్రాంతాలలోకి నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని ప్రకాశం బ్యారేజ్ నుంచి 3.75 లక్షల క్యూసెక్కులు సోమవారం విడుదల చేస్తున్నారు. మండలంలోని పెసర్లంక- పెదలంక అరవింద వారధి సమీపంలోని నక్కపాయ గండి, గాజుల్లంక చినరేవు, పోతార్లంక - గాజుల్లంక నడుమ కృష్ణా నది గట్లకు ఏర్పడిన గండ్లు ద్వారా వరద నీరు ఉధృతంగా పల్లపు ప్రాంతాలలోకి ప్రవహిస్తున్న కారణంగా గ్రామాలను వరద నీరు చుట్టుముడుతోంది. దోనేపూడి కరకట్ట దిగువును పోతార్లంక- దోనేపూడి లోలెవల్ వంతెన(చప్టా) పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, కిష్కిందపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి ప్రజలు చుట్టు మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు.

కరకట్ట గండిని పరిశీలించిన కలెక్టర్



ఓలేరు(భట్టిప్రోలు): కృష్ణా నది పరీవాహక లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం పరిశీలించారు. బాపట్ల జిల్లా పరిధిలోని భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో మళ్లీ కరకట్ట దెబ్బ తినకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి, డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, భట్టిప్రోలు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్పర్సన్ పరుచూరి రమేష్ ఉన్నారు.



దోనేపూడి వద్ద నీటి తరలింపునకు కరకట్టను తవ్వి ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల: బంగాళాఖాతంలో అల్ప పీడనంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 24 గంటలపాటు కంట్రోల్ రూమ్ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు.

కంట్రోల్ రూమ్ 9711077372 టోల్-ఫ్రీ నంబర్ 1077, 1070

సూర్యలంక బీచ్ అభివృద్ధి ఎప్పటికో!

- కూటమి సర్కార్ రాగానే నిధులొస్తున్నాయంటూ ప్రచారం
- ఏడాది తర్వాత రూ. 97.52 కోట్లు మంజూరైనట్లు ప్రకటన
- సర్కార్ కొలువుదీరి 15 నెలలు దాటుతున్నా మొదలు కాని పనులు
- రూ.50.70 కోట్లు పనులకు టెండర్లు పిలిచినట్లు ప్రచారం
- టెండర్ ప్రక్రియలోనూ వివాదాలు అంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అదిగో.. అదిగదిగో.. అంటూ ఊరిస్తూ వస్తున్న సూర్యలంక తీరం అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి సర్కార్ కొలువుదీరాక సూర్యలంక తీరం అభివృద్ధికి దాదాపు రూ.100 కోట్ల నిధులొస్తున్నాయంటూ ఇక్కడి పచ్చనేతలు ప్రచారం మొదలుపెట్టారు. మార్చి నెలలో రూ.97.52 కోట్లు నిధులు మంజూరైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది జూలై 23న రూ. 50.70 కోట్ల అభివృద్ధి పనులకు పర్యాటకాభివృద్ధి శాఖ టెండర్లు పిలిచినట్లు ప్రకటించింది.

కాంట్రాక్టులపై వివాదం..

అభివృద్ధి పనులకు పోటీపడి ఎల్-1గా నిలిచిన గుత్తేదారు తాము చేస్తున్న పనుల వివరాలను ప్రస్తావించలేదని, ఇది నిబంధనలకు విరుద్ధమని మరో ప్రధాన గుత్తేదారు సంస్థ ఫిర్యాదు చేయడంతో టెండర్లలో వివాదం నెలకొన్నట్లు సమాచారం. వాస్తవానికి ఈ కాంట్రాక్ట్‌పనులు దక్కించుకునేందుకు పచ్చనేత సిద్ధమవ్వగా ఆయనతో సన్నిహితంగా మెలిగిన జిల్లా మాజీ ఉన్నతాధికారి కాంట్రాక్ట్ తనకు కావాలని పట్టుబట్టినట్లు సమాచారం. అప్పటికే తీరప్రాంతంలోని ప్రభుత్వ, అసైన్ భూముల లావాదేవీల్లో సదరు అధికారి పచ్చనేతకు సహకరించారన్న ప్రచారం జరిగింది. దీంతో పచ్చనేత రూ.50.70 కోట్ల సూర్యలంక అభివృద్ధి పనులను పూర్తిగా కాకుండా కొంతవాటా ఇచ్చేందుకు అంగీకరించినట్లు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో సదరు అభివృద్ధి పనుల టెండర్లలో పచ్చనేత, అధికారి తరుపున పాల్గొన్న గుత్తేదారు ఎల్-1గా ఉన్నట్లు సమాచారం. పనులు దక్కించుకున్నా.. అభివృద్ధి పనులు మాత్రం మాజీ ఉన్నతాధికారి సమీప బంధువులు చేయనున్నారని జిల్లా అధికారవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. టెండర్లలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో సూర్యలంక అభివృద్ధి పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యేలా కనిపించడంలేదు. రూ. 50.70 కోట్ల పనుల సంగతి ఇలా ఉంటే ఇక మిగిలిన రూ.46.82 కోట్ల పనులు ఎప్పటికి టెండర్లకు నోచుకొని పనులు మొదలవుతాయో అంతుచిక్కడంలేదు. పనులు తామే చేయాలన్న ఉద్దేశంతో జిల్లా మాజీ ఉన్నతాధికారి ప్రయత్నించగా అందుకు పర్యాటకాభివృద్ధి శాఖ అధికారులు సహకరించే క్రమంలోనే సూర్యలంక తీరం అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది.

అద్దె బస్సులకు మైలేజీ తిప్పలు

ఆందోళనలో యజమానులు

- జిల్లాలోని డిపోల్లో సగానికి అద్దె బస్సులే
- 56 సీటింగ్ కెపాసిటితో నడిపేందుకు ఆర్టీసీతో ఒప్పందం
- ఫ్రీ బస్‌తో పెరిగిన రద్దీ
- నిర్వహణ ఖర్చు పెంచాలంటూ వేడుకోలు



చీరాల అర్బన్: స్త్రీశక్తి పథకంతో అద్దె బస్సుల యజమానులు కష్టాలపాలవుతున్నారు. పథకాన్ని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే అమలు చేస్తున్నారు. జిల్లాలో అధిక శాతం బస్సులు హయర్ బస్సులే. కూటమి సర్కారు దెబ్బకు చితికిపోతున్నారు. నిర్వహణ భారం మోయలేకపోతున్నామని యజమానులు వాపోతున్నారు.

ఆందోళనలో అద్దె బస్సుల యజమానులు..

-జిల్లాలో చీరాల, బాపట్ల, రేపల్లె, అద్దంకి ఆర్టీసీ డిపోలున్నాయి. మొత్తం 253 బస్సులు సేవలందిస్తున్నాయి. స్త్రీశక్తి పథకం 212 బస్సుల్లో అమలవుతోంది. అందులో వంద వరకు అద్దె బస్సులే నడుస్తున్నాయి. 56 సీటింగ్ కెపాసిటీతో నడిపేందుకు యజమానులతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. రద్దీ పెరగడంతో మైలైజ్ పడిపోయింది. మెయింట్‌నెన్స్‌పై ఆందోళన చెందుతున్నారు. అద్దె బస్సుల టెండర్ల సమయంలో ఫ్రీ బస్ ప్రస్తావనే లేదని, తక్కువ కోడ్ చేసిన వారికే టెండర్లు దక్కడంతో ఇప్పుడే ఏమి చేయలేని స్థితిలో ఉన్నామంటూ ఆందోళన చెందుతున్నారు.

ఆర్టీసీ కంటే అద్దె బస్సులే అదనం..

జిల్లాలో మొత్తం 212 బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతుంటే వీటిలో వంద బస్సుల వరకు అద్దె బస్సులున్నాయి. వీటిలో ఎక్స్‌ప్రెస్ 20, పల్లెవెలుగు 70 ఉన్నాయి. హయర్ బస్సులకు 56 సీటింగ్ కెపాసిటీ ఉండాలి. సర్వీసు రూట్‌ను బట్టి టెండర్లలో కోడ్ చేసిన విధంగా పల్లెవెలుగు బస్సుకు రూ.8 నుంచి రూ.12 వరకు, ఎక్స్‌ప్రెస్‌కు రూ.9 నుంచి రూ.14 చొప్పున కిలోమీటరుకు ఇస్తున్నారు. పల్లె వెలుగు బస్సుకు లీటర్ డీజిల్‌కు రూ.5.5 కిలోమీటర్లు ప్రయాణించాలి. మైలేజ్ షార్టేజ్ వస్తే ఆ భారాన్ని యజమానులే భరించాలి. ఫ్రీ బస్సు వలన ప్రయాణికుల రద్దీ పెరుగింది. కెపాసిటికి మించి బస్సులో ప్రయాణికులు ఎక్కితే ఓవర్ లోడ్ వలన టైర్లు అరుగుదల, ఇంజన్ సంబంధిత సమస్యలు తలెత్తి మెయింటెనెన్స్ పెరిగిపోతుంది. ప్రస్తుతం ఆయిల్ షార్టేజ్ వలన నెలకు అదనపు భారం పడుతుంది. అలానే రవాణా శాఖ నిబంధనల మేరకు సీటింగ్ కెపాసిటి 56 మందికే ప్రీమియం చెల్లిస్తారు. ఓవర్ లోడ్‌తో అనుకోని ప్రమాదం ఏదైనా జరిగితే బీమా కొందరికే వస్తుంది.

> **అద్దె డబ్బులు ఖర్చులకే సరిపోతున్నాయి..**
>
> ఆర్టీసీలో అద్దె బస్సులు నడపడం ద్వారా కిలోమీటరుకు ఇచ్చే డబ్బులు బస్సుల మెయింట్‌నెన్స్‌కే సరిపోతున్నాయి. నెలకు లక్షన్నర రూపాయలు వస్తే అందులో ఈఎంఐ, డ్రైవర్లు, క్లీనర్ల జీతాలు, డీజిల్, మెయింట్‌నెన్స్‌కే సరిపోతుంది. నిర్వహణ భారం పెరగడంతో వచ్చిన ఆదాయం కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్నాయి. తమ సమస్యలపై రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు యాజమాన్యానికి విన్నవించాం. కిలోమీటర్‌కు మైలేజ్ తగ్గించాలని, మెయింట్‌నెన్స్ చార్జీలు కిలోమీటర్‌కు పెంచాలని కోరుతున్నాం.
>
> – ఎస్.శ్యామ్‌ప్రసాద్, స్టేట్ జనరల్ సెక్రటరీ, హయర్ బస్ ఓనర్స్ అసోసియేషన్

ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

చీరాల అర్బన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని చీరాల, పేరాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాలతో పాటు, భావనారుషి దేవాలయం, పేరాల శివాలయంలో, ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి దేవాలయం, కామాక్షి అమ్మవారి దేవాలయం తదితర దేవాలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారి చిత్రపటంతో నగరోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి 1116 మంది మహిళలు కలశ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష అలంకరణలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు గుంటూరు మాధవరావు పాల్గొన్నారు. అలానే పేరాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో, బెస్తపాలెంలోని సాయిబాబా మందిరంలో, పాపరాజుతోటలోని కామాక్షి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



చీరాలలో 1116 కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

జిల్లెళ్లమూడిలో..

బాపట్లటౌన్: జిల్లెళ్ళమూడిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వజనని పరిషత్ ట్రస్ట్ ట్రెజరర్ జె.ఎల్.పి.సుబ్రహ్మణ్యం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



బాలా త్రిపుర సుందరీదేవి బగళాముఖి అమ్మవారు



గోవాడలో బాలకోటేశ్వర స్వామి ఆలయంలో..

దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

అమృతలూరు(వేమూరు): మండలంలోని గోవాడ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన చేసి మొదటి రోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించినట్లు అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.



జిల్లెళమూడి అమ్మవారి దేవాలయంలో పూజలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): చందోలు శ్రీ బండ్లమ్మ ఆలయం అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, మంతెనవారిపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయం, ఖాజీపాలెం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాలలో కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ డాక్టరు వినోద్‌కుమార్

బాపట్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద ముమ్మరంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం, జి.ఎస్.డబ్ల్యూ.ఎస్ సేవలు, స్వామిత్వ, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో స్వామిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో జి.ఎస్. డబ్ల్యూ.ఎస్ సేవలను పెండింగ్ లేకుండా సత్వరమే ప్రజలకు అందించాలని ఆయన చెప్పారు. మనమిత్ర క్యాంపు మరియు ఆధార్ సీడింగ్ వాహనాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. కర్లపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అభివృద్ధి పనుల అమలులో వెనుకబడి ఉన్నారని పద్ధతి మార్చుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జి.ఎస్ బ్ల్యూ.ఎస్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పరిపాలనలో పారదర్శకంగా ఉండాలి

బాపట్ల: జిల్లా యంత్రాంగం పరిపాలనలో పారదర్శకంగా, నాణ్యతతో పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో కలెక్టర్ కార్యాలయ పీజీఆర్ఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బాపట్ల జిల్లా పరిపాలనలో అన్ని విభాగాలలో ర్యాంకింగ్‌లో మొదటి మూడు వరుసలలో ఉండే విధంగా సిబ్బంది పని చేయాలని చెప్పారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఏమైనా సమస్యలు ఉంటే సత్వర పరిష్కార చర్యల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, డీఆర్ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి నాగిరెడ్డి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మల్లికార్జున రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,400 గరిష్టం : రూ. 3,400

మోడల్ ధర రూ. 2,900

పసుపు ధరలు (సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1173

కొమ్ములు : 957 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,785	10,650

కాయలు : 216 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,325	10,650	10,525

మొత్తం అమ్మకాలు : 879.75 క్వింటాళ్లు



నేత్రపర్వం.. నగరోత్సవంలో భాగంగా పల్లకీపై ఊరేగుతున్న ఆది దంపతులు

వైభవంగా ప్రారంభమైన 'శరన్నవ' సంబరం

జగన్మాత కనక దుర్గమ్మ భక్తకోటి హృదికి బాలగా, నిత్య కల్యాణశీలిగా సాక్షాత్కరించిన వేళ.. దేదీప్యమానమైన ఇంద్రకీలాద్రి భక్త కోటితో మరింత తేజోమయమైంది. నవరాత్రుల శోభ విజయవాడ నలుదిశలా పండువెన్నెలలా ప్రకాశించింది. ఇంద్రకీలాద్రిపై దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భజన బృందాలు.. కోలాటాలు.. సాంస్కృతిక కార్యాక్రమాల సందడితో దుర్గగుడి పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7గంటలకు, 10గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం (యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 4 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ సేవ
- సాయంత్రం 6 గంటలకు మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

పూర్ణఫలం.. బాలానందం

- తొలి రోజు బాలా త్రిపురసుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం
- తొలి దర్శనం చేసుకున్న మంత్రులు, జిల్లా అధికారులు
- భక్తులతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- వేడుకగా ఆది దంపతుల నగరోత్సవం
- నేడు శ్రీగాయత్రిదేవిగా దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజల అనంతరం దర్శనాలకు అనుమతించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి అనిత, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, దుర్గ గుడి ఈవో శీనా నాయక్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు తొలి దర్శనం చేసుకున్నారు. ఉదయం 8 గంటలకు అన్ని క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ప్రధాన ఆలయంలోని అమ్మవారి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహా మండపం ఆరో అంతస్తుకు తీసుకువెళ్లి ప్రతిష్ఠించారు. ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం సమీపంలోని యాగశాలలో కలశస్థాపన, పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.





త్రిపుర సుందరీదేవిని దర్శించుకునేందుకు క్యూలైన్లో వేచి ఉన్న భవానీలు, భక్తులు

జన హృది బాలా.. నిత్యకల్యాణశీలా..

బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గమ్మకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ప్రత్యేక కుంకుమార్చనలో 104 మంది ఉభయ దాతలు ఆలయ ప్రాంగణంలో శ్రీచక్రనవార్చనలో 13 మంది, చండీయాగంలో 29మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. పూజల్లో పాల్గొన్న వారికి రూ.300 క్యూలైన్‌లో బంగారు వాకిలి దర్శనం కల్పించారు. ఇక పరోక్ష చండీ హోమానికి 57మంది, కుంకుమార్చనకు 18మంది రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో పూజను వీక్షించారు. మహా మండపం ఆరో అంతస్తులో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నయనానందకరం.. నగరోత్సవం..

ఆది దంపతుల నగరోత్సవ సేవ సోమవారం సాయంత్రం కనుల పండువగా సాగింది. శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలతో పాటు కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, కావడి నృత్యాలతో పలువురు కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గనగర్, రథం సెంటర్, దుర్గాఘాట్, దుర్గగుడి ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది.

ఏర్పాట్ల పరిశీలన..

ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. తొలుత కలెక్టర్, కమిషనర్ క్యూలైన్‌లో ఉన్న భక్తులతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో చర్చించారు. అనంతరం నూతన అన్నదాన భవనంలో జరుగుతున్న అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. ఆలయ ఈవో శీనానాయక్‌తో కలిసి అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆహార పదార్థాల నాణ్యత, ఆలయ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై భక్తులను అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..

దేవస్థానంలోని కళావేదికపై ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు 12 గంటలపాటు సాగాయి. పలు బృందాలకు చెందిన కళాకారులు నృత్యాలను అభినయించారు. కాగా ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం దుర్గమ్మ శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.



నాట్య సమ్మోహనం.. సాంస్కృతిక కార్యక్రమంలో నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారిణి



కొలాటం ఆడుతున్న యువతులు

క్లుప్తంగా

మాతృ మరణాలను అరికట్టాలి

గుంటూరు డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గుంటూరులోని కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ లెవెల్ మాతృ మరణాల సమీక్ష సమావేశం జరిగింది. చేబ్రోలు, నిడమర్రు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జులై, ఆగస్టుల్లో జరిగిన మూడు మాతృ మరణాలపై సభ్యులు సమీక్షించారు. మరణానికి గల కారణాలను అధ్యయనం చేశారు. అందులో ఒకటి నివారించగలిగినది గాను, రెండు నివారించలేనివి గాను నిర్ధారించారు. సమావేశానికి హాజరైన ఆశా కార్యకర్తలు,ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. గర్భం దాల్చినప్పటి నుంచి తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం పై అవగాహన కల్పించాలని చెప్పారు. తొలుత ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రమాదకర పరిస్థితులు సంభవించినప్పుడు ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించి, మాతృ మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రంగారావు , ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ , జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి విక్రయిస్తూ, ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ఎనిమిది మంది అంతర్రాష్ట్ర దొంగలను అరండల్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం బ్రాడీపేటలో కొంత మంది గుంపుగా చేరి గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజుకు సమాచారం వచ్చింది. హుటాహుటిన ఆయన ఎస్‌ఐ కృష్ణ బాజీ, సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించగా కొంత మంది పరారయ్యారు. మిగిలిన వారిలో శ్రీనగర్‌కు చెందిన ఇంజాపల్లి మేరి బాబు, వెంగళరావునగర్‌కు చెందిన యద్దనపూడి దీనభాస్కర్, శారదా కాలనీకి చెందిన బడుగు ప్రభుకుమార్, ఒక మైనర్ బాలుడు, గోరంట్లకు చెందిన పణిదరపు అమరజ్యోతి, వెంగళరావు నగర్‌కు చెందిన ఏలూరి ఎలిజిబెత్ రాజు, శివనాగ రాజు కాలనీకి చెందిన తూతిక అలియాస్ పాతూరి సైని, అలియాస్ హనీ, ఒరిస్సా రాష్ట్రంలోని పారిమ గ్రామానికి చెందిన పారిమ జోయామాజిలను అదుపులో తీసుకుని, కేసు నమోదు చేశారు. వీరి వద్ద గల 3.5 కేజీల గంజాయితో పాటు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు గంజాయి తాగుతున్న ఏసుబాబు, హర్ష సరిపుద్దీన్, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, అమరజ్యోతి, ఈశ్వర్, మురళి, వీరాస్వామిలు పరారీలో ఉన్నారు. వీరిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్లటౌన్: అర్జీదారుల సమస్యలు పరిష్కరించడంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 65 మంది బాధితులు వచ్చి నేరుగా తమ సమస్యలను ఎస్పీకు వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ అర్జీల స్వీకరణ అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మానవీయ కోణంతో వ్యవహరిస్తూ అర్జీలను చట్టపరిధిలో పరిష్కరించాలని చెప్పారు. పదే పదే బాధితులను స్టేషన్ చుట్టూ తిప్పుకోరాదని సూచించారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు తగిన గౌరవం ఇచ్చి వారితో ఫ్రెండ్లీగా మెలగాలని కోరారు. వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకొని వాటిని పరిష్కరించినప్పుడే పోలీస్‌శాఖపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్‌ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

బాపట్లటౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సైబర్ నేరాలపై ఎస్పీ ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్(ఆన్‌లైన్ వీడియో కాల్‌లో అరెస్ట్) అనేది లేదని, డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరగాళ్లు చేసే వీడియో కాల్స్‌కు స్పందించవద్దని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. డిజిటల్ అరెస్ట్, పీఎం కిసాన్ యాప్ ఏపీకే ఫైల్స్ మోసాలు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, నకిలీ లోన్ యాప్స్, పార్ట్ టైం జాబ్స్, నకిలీ వెబ్‌సైట్లు, బ్యాంకింగ్, ఈ కామర్స్, సోషల్ మీడియా వంటి పలు రకాల మోసాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతూ బాధితుల నుంచి రూ.లక్షల్లో నగదు కొల్లగొడుతున్నారని పేర్కొన్నారు.



బాధితురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్స్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర కార్యదర్శి ఆర్.నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, సమానత్వ భావాలతో పాటు దేశభక్తిని పెంపొందిస్తున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఆర్. నరసింహారావు తెలిపారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో గుంటూరు జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వార్షిక సమావేశాన్ని జిల్లా కార్యదర్శి ఎం. ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారావు గుంటూరు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ రిజిస్ట్రేషన్, బిగినర్స్ కోర్స్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 955 పీఎంశ్రీ పాఠశాలలకు రూ. 50 వేలు చొప్పున విడుదల చేసిన నిధులతో విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉన్నతమైన సంస్థగా గుర్తింపు పొందిన స్కౌట్స్, గైడ్స్ ఆశయాలకు అనుగుణంగా సేవా భావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని 111 పాఠశాల నుంచి 136 యూనిట్స్ రిజిస్ట్రేషన్ చేశారని వివరించారు. సమావేశంలో ఎస్‌ఓసీ పి. శ్రీనివాసరావు, చేబ్రోలు ఎంఈవో రాయసుబ్బారావు, పెదకాకాని ఎంఈఓ బీవీ రమణయ్య, డీటీసీ టి. నరేష్, డీఓసీ ఎం.శ్రీ హరి, ఘంటా కిరణ్, కామాక్షి, అనిల్, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరసింహారావు

ఉత్కంఠభరితంగా జాతీయ చెస్ పోటీలు

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్‌లో నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీలు సోమవారం రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగాయి. 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 30 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు సహా మొత్తం 394 మంది పోటీ బరిలో నిలిచారు. తొలి రౌండ్‌లో ఎక్కువ మంది గ్రాండ్ మాస్టర్లు, ఇంటర్నేషనల్ మాస్టర్లు సునాయాస రెండో రౌండ్‌కి చేరుకున్నారు.

- రెండో సీడ్ సూర్యశేఖర్ గంగూలీ మొదటి రోజు సుదీర్ఘమైన గేమ్‌ను ఆడి, చివరికి తనదైన స్టైల్‌లో విజయం సాధించారు.
- రైల్వే జట్టుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ దీపన్ చక్రవర్తి, ఐఎం సిద్ధాంత్ మోహాపాత్రా ప్రత్యర్థులతో పాయింట్లు పంచుకోవాల్సి వచ్చింది.
- పీఎస్‌పీబీకి చెందిన ఐఎం నిషా మొహోటా, తెలంగాణ ఆటగాడు మోక్షిత్ పసుపులేటి చేతిలో ఓటమి పాలయ్యారు.
- ఆంధ్రప్రదేశ్ అభిమాన ఆటగాడు, 2017 జాతీయ చాంపియన్ లలిత్ బాబు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గగన్ సహూను చాకచక్యంగా ఓడించారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రోడ్డు కావాలని వినతి

కర్లపాలెం: మా ఊరికి రోడ్డు కావాలంటూ పలు గ్రామాలకు చెందిన యువకులు శాంతియుత నిరసన ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కర్లపాలెం మండల పరిధిలోని గణపవరం, చిన పులుగువారిపాలెం, పెదపులుగువారిపాలెం గ్రామాలకు చెందిన యువకులు మా ఊరికి రోడ్డు కావాలంటూ ఫ్లెక్సీ చేతబట్టి ప్రదర్శనగా సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడతూ కర్లపాలెం మండల కేంద్రం నుంచి చింతాయపాలెం, గణపవరం, చినపులుగువారిపాలెం, పెదపులుగువారిపాలెం గ్రామాల ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులు పడి వాహనాలు నడిచేందుకు అసౌకర్యంగా ఉందని, ఈ రహదారి వెంట సుమారు పది గ్రామాలకు పైగా ప్రజలు ప్రతిరోజూ ప్రయాణం చేయాల్సి వస్తుందని అన్నారు. ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని.. రహదారి గుంతల్లో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తుందని తెలిపారు. అనేక సార్లు గుంతలలో ఆటోలు, స్కూలు బస్సులు ఇరుక్కుపోయిన సందర్భాలు ఉన్నాయని, ద్విచక్ర వాహనాలు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాగఫణికుమార్, దుర్గా ప్రకాష్ అక్కల గోపిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, ఉర్లారెడ్డి, హనుమంతు, జనార్ధన్, చంచయ్య తదితరులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రేమ్ రాజ్ దుర్మరణం

ఘంటసాల: రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. చల్లపల్లి వైపు నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ మరమ్మతులకు గురి కావడంతో ఘంటసాల మండలం లంకపల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిపివేశారు. పాస్టర్ ప్రేమ్‌రాజ్(41) తన స్వగ్రామమైన బాపట్ల జిల్లా మోర్తోట గ్రామంలోని చర్చిలో ఆదివారం రాత్రి ప్రార్థన ముగించుకుని ప్రస్తుతం తాను నివాసం ఉంటున్న బుద్దాలపాలేనికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. లంకపల్లి గ్రామం వద్ద చీకటిలో ఉన్న టిప్పర్‌ను గమనించకపోవడంతో వెనుక నుంచి ఢీ కొట్టాడు. ప్రేమ్‌రాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక ఉన్న భార్య, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారు ముగ్గురిని చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు ప్రేమ్‌రాజ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ్ రాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దివిసీమ పరిసర ప్రాంతాల పాస్టర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రేమ్ రాజ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బుద్దాలపాలెంలో పాస్టర్ ప్రేమ్‌రాజ్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.



పోక్సో కేసు నిందితుడికి పదేళ్ల జైలు

నాదెండ్ల: పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. ఎస్‌ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బాలిక 2025 మే 28న గ్రామానికి చెందిన మందలపు శివ ప్రసాద్ తనపై లైంగిక దాడి చేశాడంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ సి.విజయభాస్కర్ విచారణ చేశారు. కోర్టులో వాదనల అనంతరం నేరం రుజువు కావటంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.